నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 18 అక్టోబర్ 2024 | SIDDIPET

మృతదేహాల అప్పగింతలో ఉద్రిక్తత

తూప్రాన్ మార్చురీ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

తూప్రాన్, అక్టోబర్ 17: శివ్వంపేట మండలం ఉసిరికపల్లి వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు అక్కడి కక్కడే మృత్యువాత పడిన విషయం తెలిసిందే. గాయపడిన డ్రైవర్ నామ్‌సింగ్ హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించే సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. శివ్వంపేట మండలం బీమ్లా తండా, సీతారాం తండా, తలపల్లి తండావాసులు పెద్దఎత్తున తూప్రాన్ దవాఖానకు చేరుకున్నారు.డ్రైవర్ నామ్‌సింగ్‌ను అప్పగించిన తర్వాతే మృతదేహాలను తరలించాలని పోలీసులతో ఆందోళన కారు లు వాగ్వాదానికి దిగారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆందోళనకారులను సముదాయించి, బాధి త కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూ స్తామని హామీ ఇచ్చారు. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందంలతో పాటు శివ్వంపేట, మనోహరాబాద్ మండలాల పోలీసుల మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

మేల్కొన్న అధికారులు

ప్రమాదం జరిగిన శివ్వంపేట మండలం ఉసిరికపల్లి శివారులో గో స్లో బోర్డు ఏర్పాటు

శివ్వంపేట, అక్టోబర్ 17: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందిన విషయం విధితమే. ఈ ప్రమాదం చోటుచేసుకోవడానికి పలు కారణాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రహదారి నుంచి ఉసిరికపల్లి రోడ్డుకు మరలిన కారు అతివేగంగా కల్వర్టు దగ్గరకు వచ్చింది. అక్కడ చేపడుతున్న మరమ్మతులతో రోడ్డు సింగిల్‌గా ఉండడంతో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని కాలువలో పడి ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కల్వర్టు వద్ద ప్రమాదానికి ముందు వరకు ఎక్కడా సూచిక బోర్డులు లేవని, ప్రమాదం జరిగిన తరువాత అధికారులు మేల్కొని గో స్లో బోర్డులు ఏర్పాటు చేశారని స్థానికులు చెబుతున్నారు. కల్వర్టు వద్ద కనీసం రెయిలింగ్ లేదన్నారు. డబుల్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా పది నిమిషాల్లో ఇంటికి చేరాల్సిన ఏడుగురు గిరిజనులు కారు ప్రమాదంలో మృతి చెందడం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

మార్గదర్శకాలు పాటించాలి

సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 17: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలతో చర్చించి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులను కోరారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో మార్గదర్శకాలు పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. మార్గదర్శకాలను పాటించేలా చూడాలని, అర్హులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజయేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కలుషిత నీటితో జనం బెంబేలు

- తాగునీటి సరఫరాపై ప్రభుత్వానికి పట్టింపేదీ..?
- చిన్నపాటి మరమ్మతులకు నెలల తరబడి కాలక్షేపం
- అధికారుల అలసత్వంపై సర్వత్రా విమర్శలు
- కలుషిత నీరు తాగి దవాఖానల పాలవుతున్న ప్రజలు
- సర్కారు వైఫల్యానికి సంజీవన్‌రావుపేట్ ఘటనే సాక్ష్యం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో యంత్రాంగం పర్యవేక్షణ కరువు

సిద్దిపేట జిల్లా రాఘవాపూర్‌లో అపరిశుభ్రంగా ఉన్న మినీ వాటర్ ట్యాంక్

మెదక్ జిల్లా శివ్వంపేటలోని ఎస్టీ హాస్టల్ వద్ద మురుగునీటిలో మంచినీటి వాల్వ్

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన 52 ఏండ్ల నాటి వాటర్ ట్యాంకు

సిద్దిపేట, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి):పాచితో కూడిన వాటర్ ట్యాంకులు, పాకురు పట్టిన పైప్‌లు, ట్యాంకుల చుట్టూ అపరిశుభ్రత, పైప్‌లైన్ లీకేజీలు, నెలల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం, ఫలితంగా కలుషిత నీరే ప్రజలు వినియోగించాల్సి వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వక పోవడంతో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటీవల సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో కలుషిత నీటిని తాగి ఇద్దరు మృతి చెందడంతో పాటు పలువురు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నీటి నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో ఇటీవల కాలంలో నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజలు గుక్కెడు తాగునీటికి తిప్పలు పడుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో...

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏ దవాఖాన చూసినా రోగులతో కిటకిటలాడుతున్నది. గ్రామాల్లో అపరిశుభ్రతతో జనం రోగాల బారిన పడుతున్నారు. తాగునీరు కలుషితంతో అనారోగ్యానికి గురవుతున్నారు. పరిశుభ్రంగా ఉంచాల్సిన ట్యాంకులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ప్రధాన పట్టణాలు, గ్రామాలు, తండాల్లో కలుషిత నీరు సరఫరా అవుతున్నది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం, వారికి సురక్షిత నీరు అందించాలన్న ఆలోచన చేయడం లేదు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్యలపై జిల్లా మంత్రులు కనీసం సమీక్షలు చేయడం లేదు. అధికార యంత్రాంగం సైతం ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నది. వెరసి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. సిద్దిపేట జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు, 756 ఆవాస ప్రాంతాలు ఉన్నాయి. పాతవి, కొత్తవి కలిపి 1657 ట్యాంకులు, 2,32, 223 నళ్లా కనెక్షన్లు ఉన్నాయి. మెదక్ జిల్లాలో 719 ట్యాం కులు, 1,92,857 నళ్లా కనెక్షన్లు, సం గారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు, 943 ఆవాస ప్రాంతాలు, 2,79,919 నళ్లా కనెక్షన్లు, 1,658 ట్యాంకులు ఉన్నాయి. ఇవన్నీ బీఆర్ఎస్ హయాం లో ఇచ్చారు. పట్టణాల్లో ఒక్కొక్కరికి 135 లీటర్లు, గ్రామాల్లో ఒక్కొక్కరికి 100 లీటర్ల శుద్ధి చేసిన నీటిని అందించారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో 2011 ప్రకారం 33,07,121 జనాభా ఉన్నారు. వీరిలో 16,60,083 మంది పురుషులు, 16,47,083 మంది మహిళలు ఉన్నారు. 2022లో 35, 85,580 మంది జనాభా(అంచనా)కాగా, వీరిలో 17,99,813 మంది పురుషులు, 17,85,767 మంది మహిళలు ఉన్నారు. 2022లోసిద్దిపేట జిల్లాలో 10,97,281 మొ త్తం,5,46,454 పురుషులు 5,50,827 మహిళలు ఉన్నారు. మెదక్ జిల్లాలో 8,32,045 మంది జనాభా కాగా, వీరిలో పురుషులు 4,10,481, మహిళలు 4,21, 564 ఉన్నారు. సంగారెడ్డి జిల్లా లో 16,56,254 మొత్తం జనాభా కాగా, పురుషు లు 8,42,878, మహిళలు 8,13,376 ఉన్నారు.

తాగునీరు కలుషితం

గ్రామాలు, పట్టణాల్లో పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతున్నది. లీకేజీలకు మరమ్మతులు చేయించకపోవడంతో ప్రజలకు కలుషిత నీరే వాడాల్సి వస్తున్నది. ఫలితంగా రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం లేదు. ట్యాంకులను ప్రతినెలా మూడు సార్లు శుభ్రం చేయాలి. కానీ, నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. ట్యాంకుల చుట్టూ పాచి పేరుకుపోతున్నది. ట్యాంకు లోపల పాకురు పట్టి శుద్ధిచేసిన నీరు అంతా కలుషితం అవుతున్నది. తద్వారా పైప్‌ల నుంచి పాకురు పట్టిన నీటితోపాటు మురుగు నీళ్లు వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలాచోట్ల మురుగు కాల్వల్లో పైప్ లైన్లు ఉండడంతో నీరు కలుషితం అవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం జీపీలకు నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామ కార్యదర్శులు పనులు చేయించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే కార్యదర్శులు అప్పులు తెచ్చి పనులు చేయించారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కార్యదర్శులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథను సరిగ్గా అమలు చేయడం లేదు. నిత్యం ఏదో ఒకచోట మహిళలు తాగునీటి కోసం బిందెలతో రోడ్డెక్కుతున్నారు. ఏడాది కాలంగా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. వారికి ఎలాం టి నిధులు కేటాయించక పోవడంతో ఎలాంటి పనులు చేయలేకపోతున్నారు. ట్యాంకుల వద్ద క్లోరినేషన్ సరిగ్గా చేయ డం లేదు. పారిశుధ్యం పడకేసింది. చెత్త నిర్వహణ సరిగ్గా చేయడం లేదు. దోమ ల మందు పిచికారీ చేయడం లేదు. దోమలు, ఈగలు బాగా వృద్ధి చెందాయి. ఫలితంగా గ్రామాల్లోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సంగారెడ్డి పట్టణంలోని నేతాజీనగర్‌లో మురుగునీటిలో మంచినీటి వాల్వ్

సంగారెడ్డి పట్టణంలోని నేతాజీనగర్‌లో శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంక్

తండాల్లో మిన్నంటిన రోదనలు



తాళ్లపల్లితండాలో పెద్దఎత్తున అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజలు

శివ్వంపేట, అక్టోబర్ 17 :కారు ప్రమాదంలో తండాల్లోని మూడు కుటుంబాల్లో ఏడుగురు మృతి చెందడంతో గిరిజనులు కన్నీరు మున్నీరుగా విలపించారు. బుధవారం ఉసిరికపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందగా, ఆ మృతదేహాలకు తూప్రాన్ దవాఖానలో పోస్టుమార్టం చేశారు. అనంతరం మృతదేహాలను మృతు ల తండాలైన జెగ్యతండా, బీమ్లాతండా, తాళ్లపల్లితండాలకు తరలించారు. బీఆర్ఎస్ నాయకులు చంద్రాగౌడ్, హరికృష్ణ, మన్సూర్, రమణాగౌడ్, వీరేశం, వాకిటి శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, లాయక్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

ఇంకా నేనెవరి కోసం బతకాలమ్మా....

బీమ్లాతండాకు చెందిన మాలోత్ మోహన్ భార్య, ఇద్దరు పిల్లలను కోల్పోయి కుమిలికుమిలి ఏడ్చాడు. ఇంకా నేనెవరి కోసం బతకాలి అంటూ ఆయన కన్నీటి పర్యంతం అయ్యాడు. ఇసుక లారీ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తూ ఇటీవలనే నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. ప్రమాదంలో భార్య, ఇద్దరు పిల్లలు మృతిచెందడంతో ఆయన ఒంటరివాడు అయ్యాడు.



జహీరాబాద్‌లో ఎంపీ క్యాంపు కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన ఎంపీ సురేశ్‌షెట్కార్, నాయకులు

పరిపాలనా సౌలభ్యానికే క్యాంపు కార్యాలయాలు

- రూ.2 లక్షలపైన ఉన్నవారికి రుణమాఫీ చేస్తాం
- బకాయిల పేరుతో విద్యాహక్కు హరించడం సరికాదు
- ఆర్టీసీకి 1500 కొత్త బస్సుల కోసం ఆర్డర్
- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- జహీరాబాద్‌లో ఎంపీ క్యాంపు కార్యాలయం ప్రారంభం

జహీరాబాద్, అక్టోబర్ 17: నియోజకవర్గ కేంద్రాల్లో పరిపాలనా సౌలభ్యం కోసం ఎంపీ క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేయడం హర్షనీయమని రవాణా, బీసీసంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం జహీరాబాద్‌లో ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి క్యాంపు కార్యాలయాలు దోహదపడతాయన్నారు. జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వ ధర ప్రకారం భూసేకరణ చేపడతామని తెలిపారు.200 యూనిట్ల కరెంట్ ఉచిత కరెంట్‌కు అర్హత ఉండి రాకుంటే ఎంపీడీవో కార్యాలయాల్లో పేర్లను చెక్ చేసుకోవాలన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2లక్షల వరకు రుణామాఫీ చేశామన్నారు. రెండు లక్షలకు పైగా ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని మంత్రి పొన్నం అన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల అద్దెలు బకాయిలు ఉన్నది వాస్తవమేనని, దానికి పాఠశాలలకు తాళాలు వేయించడం, రీయింబర్స్‌మెంట్ కోసం కళాశాలలు బంద్ చేయడం సరికాదన్నారు. నిరసన తెలిపే హక్కు వారికి ఉందని, కానీ..పాఠశాలలు, కళాశాలలను మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయడంతో బస్సుల కొరత ఏర్పడిందని, మరో 1500 కొత్త బస్సులను ఆర్డర్ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, హనుమంతురావు, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, ఖాజామియా, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్ (ఇన్‌సెట్‌లో) స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 17: సంగారెడ్డి జిల్లాలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్టు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ చెప్పారు. గురువారం జిల్లాలో స్వాధీనం చేసుకున్న 40 కిలోల ఎండు గంజాయి, 50 గ్రాములు హాష్ ఆయిల్ వివరాలను ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం ఉదయం 10 గంటలకు న్యాబ్ సిబ్బందితో కలిసి మనూర్ ఎస్సై డాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారన్నారు. నాగల్‌గిద్ద వైపు నుంచి నారాయణఖేడ్ వైపు వస్తున్న కేఏ29ఎన్ 1640 నంబరు గల ఒక స్విఫ్టు డిజైర్ కారును తనిఖీ చేస్తుండగా కారు డిక్కీలో 40 కిలోల ఎండు గంజాయి లభించిందన్నారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా బాల్కి పట్టణానికి చెందిన కారు డ్రైవర్ మల్లగొండగా గుర్తించామన్నారు. మల్లేశ్ అనే వ్యక్తితో కలిసి మల్లగొండ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి గంజాయి తెచ్చి అమ్మి అధిక డబ్బులు సంపాదిస్తున్నారన్నారు. సెప్టెంబర్‌లో చిరాగ్‌పల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న 140 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లు తమవే అని ఇతను ఒప్పుకొన్నాడని ఎస్పీ తెలిపారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను సాగు చేసినా, సరఫరా చేసినా ఎస్-న్యాబ్ నెంబరు 8712656777కు సమాచారం అందించాలని, వివరాలు వెల్లడించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్-న్యా బ్ సీఐ రమేశ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ విజయ్‌కృష్ణ, అమీన్‌పూర్ సీఐ నాగరాజు, నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎస్ ఎస్సై శ్రీకాంత్, మనూర్ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు చేయాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, అక్టోబర్ 17 (నమస్తేతెలంగాణ): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. పత్తి కొనుగోళ్లపై గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి మార్కెటింగ్, సహకార, సీసీఐ, పోలీస్, అగ్నిమాపక, వ్యవసాయ కాటన్ మిల్లుల యజమానులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ మొదటి వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలకు రానున్నదని, జిల్లాలో 36,142 ఎకరాల్లో పత్తి సాగు చేశారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయాలన్నారు. ఈనెల 25వ తేదీ వరకు సెంటర్లు ఓపెన్ చేయాలని, రోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 వరకు కొనుగోళ్లు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మాయిచ్చర్ మిషన్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కేంద్రాల్లో స్థానిక పోలీస్ అధికారుల నంబర్లు, అత్యవసర నంబర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తూనికలు కొలతలు శాఖ ద్వారా ప్రతి కొనుగోలు కేంద్రంలో కాంటాలకు స్టాంపింగ్ చేయాలని, గోదాములు, మిల్లుల వద్ద అగ్నిమాపక శాఖ ద్వారా తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. cotally యాప్‌ను రైతులు డౌన్‌లోడ్ చేసుకోవాలని, రైతుల ఖాతాల్లో ఈ యాప్ ద్వారా డబ్బులు తెలుసుకోవచ్చని సూచించారు. మద్దతు ధర క్వింటాలుకు రూ. 7521గా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మార్కెటింగ్ అధికారి యాదయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, అగ్నిమాపక అధికారి వేణు, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, జిల్లా రవాణా అధికారి జి.శ్రీనివాసరావు, మండలాల అగ్రికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు విధిగా టీకాలు వేయించాలి

వైకుంఠపురంలో పశువులకు టీకా వేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 17: సంగారెడ్డి జిల్లాలోని పశువులన్నింటికీ విధిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం సంగారెడ్డిలోని వైకుంఠపురంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..జిల్లాలో 72 బృం దాల ద్వారా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. 4 నెల ల పైబడిన అన్ని గోజాతి, గేదె జాతి పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేసి న ప్రతి పశువుకు గుర్తింపు చెవిపోగు వేసి, వాటి వివరాలను పశుపోషక వివరాలను భారత్ పశుధాన్ యాప్‌లో పొందుపర్చాలని కలెక్టర్ వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లాలో తెల్లజాతి పశువులు 99,188, నల్లజాతి పశువులు 1,13,828, మొత్తం 2,13,016 పశువులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి, గోశాల నిర్వాహకులు కందాడై వరదాచార్యులు, జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ సీహెచ్ రవీంద్రప్రసాద్, డాక్టర్ రాజేశ్వర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు సహించం

- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్
- జోగిపేట పీఎస్‌లో మంత్రి దామోదరపై ఫిర్యాదు

జోగిపేటలో మాట్లాడుతున్న క్రాంతికిరణ్

అందోల్, అక్టోబర్ 17: బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హెచ్చరించారు. గురువారం జోగిపేటలో మాట్లాడుతూ..ఐదు రోజుల క్రితం బీఆర్ఎస్ నాయకుడు, వట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నవీన్ రెడ్డి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు కాంగ్రెస్ నాయకులు ఆయనపై జోగిపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ఎలాంటి విచారణ లేకుండానే పోలీస్‌స్టేషన్‌లో అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఇదే విషయంపై మాట్లాడేందుకు స్థానిక నాయకులతో తాను గురువారం జోగిపేట పీఎస్‌కి వెళ్లి ఎస్సైతో మాట్లాడగా....ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేశామని, ఎవరు ఫిర్యాదు చేసినా సమన్యాయం పాటిస్తూ కేసు నమోదు చేస్తామని ఎస్సై తనకు సమాధానం చెప్పారన్నారు. దీంతో తాము కూడా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహపై ఫిర్యాదు చేస్తామని, కేసు నమోదు చేయాలని కోరినట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో మందుల కొరతపై ఓ జర్నలిస్టు మంత్రిని ప్రశ్నించగా, అతడిపై మంత్రి దురుసుగా ప్రవర్తించారని, దీనిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు అకారణంగా కేసులు నమోదు చేస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నడూ ఇలా కక్ష సాధింపు చర్యలు చేపట్టలేదని...ఎవరిపై కేసులు నమోదు చేయలేదన్నారు. తాను ఐదేండ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో అన్ని పార్టీల వారికి తగిన గౌరవం ఇచ్చానని, పార్టీలను ఎప్పుడూ చూడలేదన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలన్నారు. మంత్రిగా అందరికీ సమన్యాయం పాటిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన మంత్రి దామోదర, ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేసులు నమోదు చేయించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులకు కేసులు కొత్త కాదని, ఉద్యమంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నామని, ఇకనైనా అకారణంగా కేసులు పెట్టడం, బీఆర్ఎస్ నాయకులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని, లేదంటే మళ్లీ ఉద్యమాల బాట పట్టాల్సి వస్తుందని చంటి క్రాంతికిరణ్ హెచ్చరించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం, పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు నాగరత్నంగౌడ్, మోగులయ్య, కిష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలు మూసివేస్తే కఠిన చర్యలు

రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న లింగమూర్తి పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 18: ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో కళాశాలలు మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా కేడం లింగమూర్తి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సమాజం మీద అవగాహన ఉన్న వ్యక్తి లింగమూర్తి అని, సిద్దిపేటకు మంచి పేరు తెచ్చేలా పని చేయాలన్నారు. తన నియోజకవర్గంలోని రెండు మండలాలు కరీంనగర్ జిల్లాలో, రెండు హన్మకొండ జిల్లాలో, మూడు సిద్దిపేట జిల్లాలో ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆకాంక్ష మేరకు పని చేస్తామన్నారు. రెండోదశలో జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లు వచ్చేలా కృషిచేస్తా అన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, రూ.2 లక్షల పైన రుణం ఉన్న వారికి రుణమాఫీ చేయాలని నిర్ణయించామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే బాధ్యత తనది అని..కానీ, కళాశాలలు మూసి వేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. పేరుకు అధికారిక కార్యక్రమం అయినప్పటికీ..అందరూ కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీలతోపాటు కాంగ్రెస్ నాయకులే వేదికపై ఉండటం..అందులో అధికారులు సైతం పాల్గొనడం గమనార్హం. మంత్రి మాట్లాడుతున్న